# సౌజన్యం

## పి.వి.ప్రసాద్

నేను ఎక్కవలసిన బస్సు రానే వచ్చింది సరిగ్గా రావలసిన టైముకే. బస్సు ఆగీ ఆగగానే లోప ల్నుంచి కిందకు ఇద్దరు ప్యాసింజర్స్ దిగారో లేదో క్రిందనున్న ప్యాసింజర్స్ బస్సులో సీట్లు దొరుకుతాయో లేదో అన్న ఆత్రంతో లోపలకు ఎక్కేస్తున్నారు... క్రిక్కిరిసిన దారిలో ఒకదానినొకటి తోసుకుంటూ వెళ్ళే గొఱ్ఱెల మందలా! ఫుట్‌బోర్డ్ ప్యాసిం జర్స్‌తో జామ్ అయిపోయింది.

'వాళ్ళను కిందకు దిగనీయండయ్యా!' కం డక్టరు అరచి గీ పెడుతూన్నా లెక్కచేసేవారేరి? నేను కూడా లోనికి చొరబడ్డా. నలుగురితో పాటు నారాయణా కదా! సీట్ దొరుకుతుందో



లేదోనన్న ఆరాటం. ఎందుకోగానీ బస్సు ఎక్కగానే సీట్‌లో కూర్చుని తీరాలన్న మానసికస్థితి ప్రతి ఒక్కరిలో. చేయాల్సింది పదిహేను నిమిషాల ప్రయాణమైనా సరే. అంతకుముందు రెండుగంటలసేపైనా సరే బస్ కోసం నిలబడే వుంటాం. కానీ బస్ ఎక్కగానే పదినిమిషాల ప్రయాణం కోసం కూడా సీట్‌కోసం వెంపర్లాడటం ప్యాసింజర్ల నైజం.

'య్యో్వ్! ఇది లేడీస్‌సీట్, పైకిలే. లేడీసున్నారు" అంటూ లేడీస్ సీట్‌లో కూర్చున్నతన్ని వెనక్కు పంపేసి 'నువ్వు కూర్చో' అంటూ తన భార్యను సీట్‌లో కూర్చోమని చెప్పి ఆమె ప్రక్కన కూర్చొన్నాడొకాయన తన ప్రక్కనే ఒక ముసలమ్మ నిల్చుని వున్నా ఆమెకు సీటివ్వకుండా. అతనికి తన భార్య తప్ప ముసలామె ఆడదిగా కన్పించలేదు మరి. ఆడవారి రిజర్వేషన్ సాకుగా చేసుకొని వారినడ్డంపెట్టుకొని అన్నీ అనుభవిస్తూ మగవాళ్ళు పరిపాలనే చేస్తోంటే ఇక బస్సులో సీటును మాత్రం అనుభవించకుండా వుంటారా? ప్రక్కన మూడుకాళ్ళ ముసలమ్మ వున్నా సరే, రోగంతో మూలిగే ముసలోడువున్నా సరే!

బస్సంతా గోల గోల... దిగేవాళ్ళతో, తోపులాటలతో. త్రొక్కిసలాటలలో నాకు తెలియకుండానే, నా ప్రమేయం ఏమీ లేకుండానే బస్సు లోపలకు నెట్టివేయబడ్డాను.

'సార్! ఇక్కడ కూర్చోండి' ఒకతను ప్రక్కకు జరిగి కొద్దిగా సీటిచ్చాడు. ఆల్రెడీ ఆ సీట్‌లో ముగ్గురున్నారు. అతనిచ్చిన సీట్ నాకు ఏమాత్రం సరిపోకపోయినా ఎలాగో ఒకలా సర్దుకొని కూర్చుందామన్న కక్కుర్తితో కూర్చొనేశాను. ఆ ముగ్గురినీ ఫ్రీగా కూర్చోనివ్వక, నేనూ ఫ్రీగా కూర్చోలేక, సీట్‌లో పూర్తిగా కూర్చొని నాకు సగం సుఖం, సగం ఇబ్బంది. లేచి నిల్చుంటే సౌకర్యంగా వుంటుందని తెలిసినా సగం సుఖాన్ని పొందడానికి అలవాటుపడిన దేహం పైకి లేవనంటోంది. నా ముందున్న సీట్ కమ్మీని పట్టుకొని అలాగే కూర్చొనివున్నా ఒంటిపిట్ట సౌఖ్యాన్ని అనుభవిస్తూ. కండక్టర్ 'రైట్రైట్' అరుపుతో ఎట్టకేలకు బయల్దేరిన బస్సు ఐదునిమిషాలు ప్రయాణించిందో లేదో ఊరిపొలిమేరల్లో ఆగిపోయింది... కండక్టర్ టికెట్స్ కొట్టడానికంటూ.

'టికెట్, టికెట్' కండక్టర్ బిగ్గరగా అంటున్నాడు అలవాటుగా. కండక్టర్ అరుపులు, చిల్లర కోసం తగవులాటలు, చిన్నపిల్లల ఏడుపులు, అమ్మలక్కల సంసార గొడవలు, మగవాళ్ళ పల్లెబారు రాజకీయాలు, వాదులాటలు – బస్సంతా గోల గోల.

'వినరా వినరా నరుడా, తెలుసుకోరా పామరుడా' ఉన్నట్టుండి పాట... ముందువైపు ఎవరో పాడుతున్నారు– బస్సులోనికి వస్తూ. రాగం శ్రావ్యంగానే వుందికానీ సాహిత్యం మాత్రం తప్పుల తడక. పాటను వినగానే గుర్తుకొచ్చిన ఘంటసాల. ఏమిటో గానీ... ఘంటసాల గారి గళంనుండి జాలువారిన పాటలను ఎవరు పాడినా కూడా ఘంటసాలగారి గళంనుండే వింటున్న అనుభూతి కలుగుతుంది ఎవరికైనా. అదే ఘంటసాలగారి మహత్యం. పాట పాడుతున్న ఆ వ్యక్తి... ముఖం చూడగానే అర్థమైపోయింది. అతను గ్రుడ్డివాడని. పాట పాడుతూ అందరి ముందూ చాచుతోన్న అతని చేతిలో ఒకరిద్దరు రూపాయో, రెండురూపాయలో వేస్తున్నారు. అలాంటి మధురమైన పాటను జ్ఞాపకం చేసినందుకో లేక అతని అంధత్వానికి జాలి పడో. టికెట్ ఖరీదు పోగా మిగిలిన చిల్లర కండక్టరు వద్ద పుచ్చుకొన్నప్పటికీ ఆ పాట పాడే అతను తమవద్దకు రాగానే "చిల్లరలేదు పోవయ్యా" అనేవాళ్ళు కొందరు, అతని వైపు చూస్తే ఎక్కడ డబ్బులు యివ్వవలసివస్తుందో అన్న

ట్లుగా కిటికీగుండా బయటకు చూస్తున్న వాళ్లు మరికొందరు. పాటలోని మాధుర్యాన్ని చవి చూస్తూ అన్నీ గమనిస్తున్న నాకు చప్పున స్ఫురించిందొక్కటే... ఆ పాటను వ్రాయడానికి రచయితకు పట్టుంటే ఒకరోజో, రెండురోజులో పట్టుండొచ్చు. పాటకు బాణీలు సమకూర్చడానికి స్వరకర్తకు నాలుగు రోజులో, ఐదు రోజులో పట్టుండొచ్చు. సంగీత దర్శకుడు చెప్పిన విధంగా ఘంటసాలగారు పాటను అలవోకగా పాడేసుండొచ్చు. కానీ ఆ పాట... అప్పటినుండి యిన్నేళ్ళుగా... ఎన్ని చోట్ల... ఎన్నివేలమందికి జీవనోపాధి కల్పిస్తోందికదా అన్న ఆలోచన రాగానే వళ్ళంతా పులకరించిపోయి ఎవరో జ్ఞాపకం లేకపోయినా పాట వ్రాసిన వారికీ, స్వరకల్పన చేసినవారికీ, ఘంటసాలగారికీ మనసులోనే జోహార్లర్పించుకున్నాను.

ఆ బిక్షగాడు మెల్లమెల్లగా నేను కూర్చొన్న సీట్ వద్దకు వచ్చాడు... చేతిని ముందుకు చాచి. సరిగ్గా నా ముందు అతని చేయి. నాలో... అతనికి రూపాయో, అర్ధరూపాయో యిద్దామా, వద్దా అన్న ఆలోచన?! జేబునుపైనుండే తడిమాను. డబ్బులు చేతికి తగిలాయి. నాకు తెలుసు. జేబులో ఐదు వందల రూపాయల నోట్లు రెండు, వందరూపాయల నోట్లు ఐదు, పదిరూపాయల నోట్లు కొన్ని, మరికొన్ని చిల్లర నాణేలు వున్నాయని. జేబులోనికి చేయిని పోనిచ్చి అర్ధరూపాయో, ఒక రూపాయో తగులుతుందేమోననుకుంటూ వ్రేళ్ళతోటే వెదికా. రెండు రూపాయ నాణేలూ, ఐదు రూపాయల నాణేము తగిలింది కానీ అంతకంటే తక్కువ నాణెం తగల్లా. 'ఆ గ్రుడ్డివాడికి అంతమంది యిచ్చారుకదా, నేనొక్కడినీ యివ్వకపోతే ఏం'– ఆలోచన వచ్చీరాగానే జేబులోనుండి బయటకు వచ్చేసింది నా చేయి. హిపోక్రసీ...

నేను కూర్చొన్న సీట్‌లోనే ఆవలగా కిటికీ వద్ద కూర్చొన్నతనికి ఆ బిక్షగాడి చేయి అందక యిదిగోండి సార్, అతనికి యివ్వండి అంటూ నాకు యిచ్చిన రూపాయి నాణెం అందుకొని బిక్షగాడికిచ్చాను. డబ్బెవరిదైనా బిక్షగాడికిచ్చింది నా చేతితోనే కదా అన్న ఏదో తెలియని సంతృప్తి – శునకానందం ప్లస్ హిపోక్రసీ. అంత వరకూ పాటను ఆస్వాదించిన నేను ఏదో మాయ తెర కమ్మిన వాడిలా ముఖాన్ని సీరియస్‌గా పెట్టుకొని చేతివాచీ వైపు చూచుకొన్నా కాస్త అసహనంగా. బస్‌ను వేగంగా నడపని డ్రైవర్‌పై విసుక్కుంటూ.

నేను కూర్చున్న సీటును దాటి వెనుకకు వెళ్ళిపోయిన బిక్షగాణ్ణి చూసి, రూపాయో, అర్ధ రూపాయో యిచ్చుండాల్సిన ఆపద తప్పిపోయినందుకు హమ్మయ్య అనుకొంటూ డబ్బును అనవసరంగా నష్టపోని నా ధన జాగ్రత్తకు, లౌక్యానికి నన్ను నేను అభినందించుకొన్నా.

మరో పదినిమిషాలకంతా నేను దిగాల్సిన వూరిలో బస్సు దిగి టైం చూసుకొన్నా. చేరాల్సిన టైముకే చేరుకొన్నాలే అనుకొంటూ వేగంగా ప్రభాకర్ మాస్టారు యిల్లు చేరుకొన్నా. మాస్టారు అప్పటికే హార్మోనియం పెట్టె సిద్ధం చేసుకొని నాకోసం వేచి వున్నారు.

రెండు నిమిషాల సేపు పిచ్చాపాటి మాట్లాడిన తర్వాత మాస్టారు మొదలెట్టారు గొంతు సవరించుకొని సా పా సా అంటూ. వెంట నేను కూడా. తొలుత మహా గణపతెం మనసా స్మరామి పాటతో మొదలై తర్వాత వరుసగా మాయా మాళ్వగౌళ్వ, మోహన, శుద్ధతోడి, మధ్యమావతి, హిందోళ రాగాల్లో కీర్తనలు. మాస్టారు గొంతెత్తి పాడుతూ వుంటే నేను కూడా ఆయన పాడినట్లుగానే నా శక్తికొద్దీ తన్మయత్వంతో పాడుతూ

అభ్యాసనా పరిక్రమంలో సత్యహరిశ్చంద్ర నాటకం లోనికి ప్రవేశించా.

అలా సంగీత అభ్యాసనా అమృత జలధిలో తనివితీరా స్నానమాడడం మా యిద్దరికీ ఆరు నెలలుగా అలవాటే. విద్య నేర్పడానికి వయస్సు అడ్డంకి కాదు అన్న భావనతో యాభైఏళ్ళ వయసొచ్చినా నేను పట్టువదలని విక్రమార్కుడిలా సంగీత సాధన చేస్తున్నా, సంగీతంపై వున్న జిజ్ఞాసతో, 'హరిశ్చంద్రీయం' నాటకంలోని అడవిసీనులోని పద్యాలలో ఘన జూరం ఝఘన భారమున లేత చవులు కొనీయక' అంటూ మాస్టారు, నేనూ తారాస్థాయిలో పూర్తి చేసామో లేదో ఇంటిలోనికి వచ్చి మాకెదురుగా నిలబడ్డ ఇద్దరు అగంతకులు, మాసిన గడ్డం, రేగిన జుట్టు, చిరుగుల చొక్కా, పంచె మట్టి కొట్టుకుపోయి, ఐదున్నర అడుగుల ఎత్తున్న ఒకతను, ఇంచుమించు అదే అవతారంతో ఆరడుగుల ఎత్తున్న మరొకతను...

మా ముందున్న మంచంపై కూర్చోండి అన్నట్లుగా వారికి చేతితో సైగ చేసి 'ఏనాడు నడచినావూ, ఈ ఎడారులలోన, సలలిత ఆరామ సీమలనె కానీ' అంటూ మరొక్క పద్యం అందుకొన్న మాస్టారు, వెంట నేను మరింత శ్రావ్యంగా పాడుతూ. మాకు ఇద్దరు శ్రోతల దొరికారు కదా, వారిని రసాస్వాదనా డోలికల్లో బాగా ఓలలాడించాలన్న ఉద్దేశ్యమో ఏమో కానీ మాస్టారి చేతివ్రేళ్ళు హార్మోనియం మెట్లపై అలవోకగా పరుగులు తీస్తూవుంటే, అతని గళంలో స్వరాల మధువులు మరింతగా స్రవించి గమక రాగాలు మరింత వూపందుకొంటూ వుంటే, నేను మాత్రం తక్కువ తిన్నానా అనుకొంటూ ఆయనతో పోటీ పడుతూ నేను- ఎప్పుడూ అంతేకదా... పదిమంది చూస్తుంటేనే నాట్యగత్తె నాట్యం రక్తి కట్టేది. శ్రోతలుంటేనే సంగీతం

## తెలుగు రచయితల డైరెక్టరీ

తెలుగు జాతికి అక్షరార్చన చేస్తున్న మహామహుల వివరాలతో 'తెలుగు రచయితల డైరెక్టరీ' పేరుతో ఒక సంకలనం తీసుకురావాలని 'కిన్నెర ఆర్ట్ థియేటర్స్' వారు సంకల్పించారు. కవిత్వం, కథ, నవల, నాటకం, నృత్యరూపకం, కార్టూన్, వ్యాసం, విమర్శ, సినీరచన, పత్రికా సంపాదకత్వం వంటి అన్ని సారస్వత రంగాలలో కృషిచేసిన సృజనశీలుర వివరాలన్నిటినీ ఒకచోట చేర్చి అందరికీ అందుబాటులోకి తేవాలని చేస్తున్న ఈ ప్రయత్నానికి సహకరించవలసిందిగా తెలుగు రచయితలను కోరుతున్నారు.

గతంలో సుమారు 1100 మంది రచయితల వివరాలతో ఒక సంకలనం ప్రచురించడం జరిగింది. ఆ సంకలనంలో ప్రచురించబడిన రచయితలు కాకుండా ఇతర రచయితలందరూ తమ పూర్తి వివరాలు పంపిస్తే ఈ 2వ సంకలనంలో ప్రచురించడం జరుగుతుంది. తమ వివరాలను ఆగస్ట్ 31, 2013 లోపుగా 'కిన్నెర ఆర్ట్ థియేటర్స్, 2-2-647/153, మొదటి అంతస్తు, సెంట్రల్ ఎక్సైజ్ కాలని, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013' అనే చిరునామాకు పంపించాలి.

ఇతర వివరాలకు సంస్థ కార్యదర్శి శ్రీ మద్దాళి రఘురామ్‌ని 040-27426666 లేదా 9866057777 నంబర్లలో సంప్రదించవచ్చు.

పాలసముద్రంలా ఉప్పొంగేది. ఏ కళ అయినా అంతే కదా? మేమూ అంతే.

సంగీత సరస్వతి వీణా నాదాల్ని గళంలోకి

ఆవాహన చేసుకొని మైమరచి శ్రావ్యంగా పద్యాలు ఆలపిస్తోంటే పైకిలేచిన ఆ యిద్దరూ. పాడుతూనే వారివైపు చూస్తున్న మేము. వాళ్ళి ద్దరూ ఇంకా కాస్సేపు వుంటే బాగుండునన్న తలంపు నాలో.

ఉన్నట్టుండి తన చొక్కా జేబులోనికి చేయి వెళ్ళనిచ్చి వందరూపాయలు నోటు బయటకు తీసి భక్తిశ్రద్ధలతో హార్మోనియం పెట్టెపై పెట్టి మాస్టారుకు, నాకు నమస్కారం పెట్టి 'యిక వెళ్ళొస్తా సార్' అంటూ చెప్పి బయటకు నడవ బోయిన పొట్టిగా వున్న అతను, అతని వెంబడే మరొకతను. పాడుతోన్న పద్యాన్ని ఠక్కున ఆపి 'కూర్చోండి, ఎవరు మీరు' అడిగారు మాస్టారు.

'మాది సీతారామపురం సార్, నా పేరు వెంకటయ్య' పొట్టిగా వున్నతను చెబుతూ 'ఈయన పేరు సుబ్బరాయుడు' అంటూ చెబు తూ కాస్త పొడవుగా వున్న అతన్ని చూపాడు.

నాలో అయోమయం. ఎవరో అపరిచిత వ్యక్తులు వచ్చి, కొంతసేపు గడిపి, వందరూపా యలు హార్మోనియం పెట్టెపై వుంచి ఏ పలుకూ లేకుండా వెళ్ళబోవడం... నాకు అర్ధంగాక వారివైపే చూస్తూవున్నా.

'ఇంతకూ మీరేం చేస్తారు?' వారిని అడి గారు మాస్టారు.

'నేను సేద్యం చేస్తాను. ఈయన గుళ్ళూ గోపురాలూ కట్టిస్తుంటాడు... సుబ్బరాయుడు చెప్పాడు వెంకటయ్యవైపు చూపుతూ.

'అంటే... మేస్త్రీనా?' సుబ్బారాయుడిని అడి గాను వెంకటయ్యవైపు చూస్తూ

'మేస్త్రీ కాదు సార్! వాళ్ళనీ వీళ్ళనీ సహాయ మడుగుతూ వాళ్ళిచ్చిన డబ్బుతో గుడి కట్టిస్తుం టాడు' చెప్పాడు సుబ్బారాయుడు.

'దానివలన ఇతనికేమిటి ఉపయోగం?' ఠక్కున అని, వారివైపే చూస్తున్నాను.

'నాకు సొంతానికి ఏంగావాలి సార్? తినే దానికి పిడికెడన్నం, తాగడానికి దోసెడు నీళ్లు, కట్టుకోవడానికి మూరెడు గుడ్డ, పండుకొనే దానికి యాదో ఒగచోట రవంత ఖాళీ జాగా. ఇంతకన్నా నాకేమీ వద్దు. వీటన్నిటినీ ఆ దేవుడే చూసుకుంటాడు. ఏందో... ఒగ వూళ్ళో గుడో, దేవళమో కట్టిస్తే, ఆ వూళ్ళోటోల్లకందరికీ మం చి జరగతాదని ఒగ ఆశ అంతే. అందికే అందర్నీ అడుక్కొని బదుక్కొని కట్టిస్తావుంటా... అందరికీ మంచి జరగల్ల అని" చెప్పడం ఆపాడు వెంకటయ్య.

'అంటే ఏ పనీ పాటూ చేయకుండా గుళ్ళూ, దేవళాలూ కట్టించే నెపంతో చందాలు వసూలు చేసి కాలం వెళ్ళబుచ్చే రకమన్న మాట' నేను మనసులో అనుకొంటూ వుంటే.

'ఇంతకూ ఇప్పుడు ఇటువైపెందుకొచ్చా రు?" అడిగారు మాస్టారు.

"వెంకటాపురం వూరికి వాస్తు బాగా లేదని ఊరికి అరిష్టం రాకుండా వుండాలని ఆంజ నేయస్వామి గుడి కట్టిస్తా వుండాడు సార్! దాని కోసం డబ్బుల సహాయానికి ప్రక్కవీధిలో వుండే సుబ్బరామయ్య కాడికొచ్చినాం. మీ హార్మోనీ పెట్టె సౌండు వినిపిస్తే, ఎక్కడో పద్యాలు పాడతా వుండారని, రవంతసేపు వినేసొద్దాం రా అంటూ వెదుక్కుంటూ ఈడకి పట్టుకొచ్చినాడు సార్! సుబ్బారాయుడు చెబుతూవుంటే...

'నాకు సంగీతమంటే పాణం సార్! వొయి సులో వుండేటప్పుడు బాగా పాడతావుండేటోణ్ణి. మీరు శానా బాగా పాడతా వుండారు సార్! మీ పద్యాలిని నాకు శానా సంతోసమైపాయ.




మీకేమన్నా యిద్దామంటే నాకాడ ఈ నూర్రూపాయలూ దక్క ఇంగేమీ లేదు. అదీ... ఈ నూర్రూపాయిలు కూడా ప్రక్కవీధిలోని ఆ సుబ్బరామయ్య ఇచ్చింది. ఇంగ మేంబొయొస్తాం సార్ చెప్పి వెంకటయ్య వెళ్ళబోతూ వుంటే.

"మీరు పాటలేమైనా పాడుతారా" వెంకటయ్యను అడిగారు మాస్టారు.

"అబ్బుడెబ్బుడో వొయిసులో వుండేటబ్బుడు పాడేటోన్ని సార్. డెబ్బైఏండ్ల వొయిసైపాయ గదా. పాడితే దమ్ము పట్టుకోలేక పోతుండా, దగ్గొచ్చేస్తాది" వెంకటయ్య అన్నాడో లేదో.

"ఏదీ... ఒక పాట పాడండి..." మాస్టారు అడగగానే గొంతు సవరించుకొని, ఐదునిముషాలసేపు ఏకధాటిగా ఆంజనేయస్వామి గురించి పాటపాడి...ఇంగ మేంబోయొస్తాం సార్, ఎండెక్కి పోతాది' మాస్టారుతో చెప్పి, నావైపు చూసి 'మీ గొంతుకూడా శానా బాగుండాది సార్! మీగ్గూడా ఏమన్నా ఇద్దామనుంది గానీ యిబ్బుడు నాకాడ ఏమీ లేదు సార్' చెప్పి బయటకు నడచిన వెంకటయ్య... ముఖం లోనికి వచ్చిన ఏదో కొత్త కాంతితో.

మామూలుగా ఐతే నేనేమైనా అడుక్కొనే వాడినా అంటూ పోట్లాడేవాడినే కానీ ఎందుకో ఏమీ మాట్లాడలేకపోయా...

మరో అర్ధగంట సంగీతసాధన చేసి బస్టాండుకు చేరుకొని బస్సెక్కా. బస్సు బయల్దేరిన ఐదు నిమిషాలకు మళ్లీ పాట... 'తల్లివి నీవే, తండ్రివి నీవే, చల్లగ కరుణించే దైవము నీవే' అంటూ. అతనే... ఆ కళ్లులేని బిక్షగాడే. చప్పున వెంకటయ్య గుర్తొచ్చాడు.

నాకు తెలియకుండానే జేబులోనికి వెళ్ళి ఐదు రూపాయల నాణేన్ని బయటకు తీసి బిక్షగాడి చేతిలో వుంచిన నాచేయి... అలాటి బిక్షగాళ్ళకు ఆలంబనగా నిలచి బ్రతుకు తెరువు కల్పిస్తోన్న ఆ సంగీత సరస్వతికి నీరాజనం సమర్పించడం కోసమన్నట్లుగా. ●